విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : గ్రామదర్శనిలో గ్రామాల్లో గుర్తించిన తాగునీటి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గ్రామదర్శని కార్యక్రమం క్రింద ప్రత్యేకాధికారులు గ్రామంలో సందర్శించినపుడు 4 విడతల గ్రామదర్శనిలో గుర్తించిన సమస్యల పరిష్కారంపై గురువారం కలెక్టర్ స్పందన మీటింగ్ హాలులో గ్రామదర్శని/ మండల/ నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటిదాకా 4 విడతల్లో గ్రామదర్శిని నిర్వహించి 300 గ్రామాల వరకు గ్రామదర్శినిలో ప్రత్యేకారులు సందర్శించారని అన్నారు. మొత్తం 4 విడతల్లో 6,269 సమస్యలు గుర్తించగా 3,774 సమస్యలు పరిష్కరించిట్లు కలెక్టరు తెలిపారు. గత అక్టోబర్ 14న నిర్వహించిన మొదటి విడత గ్రామదర్శినిలో గుర్తించిన 16,023 సమస్యల్లో 1,144 పరిష్కరించినట్లు, గత నవంబర్ 19 తేదీన నిర్వహించిన 2వ విడత గ్రామదర్శినిలో గుర్తించిన 1,622 సమస్యల్లో 1,170 పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. 3వ విడత గత డిశంబర్ 30న నిర్వహించామని, 1,605 సమస్యలు గుర్తించగా 957 పరిష్కరించామన్నారు. 4వ విడత (31-01-2023) 1,462 సమస్యలు గుర్తించగా 997 పరిష్కరించామన్నారు. పెండింగ్ సమస్యలలో త్రాగునీటి ట్యాంకుల క్లీనింగ్, గ్రామాల్లో శానిటేషన్ వంటి సమస్యలు, ఆర్థికేతర సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో అవసరమైన సిసి రోడ్లు, స్కూల్స్, అంగన్వాడి భవనాలు మరమ్మత్తులు వంటి ఆర్థిక సంబంద సమస్యలు 10 లక్షల లోపు పనులు పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు అంచనాలు రూపొందించి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్, డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డిపివో నాగేశ్వరనాయక్, ఆర్డీవోలు, వివిధశాఖల అధికారులు, సిపివో వై. శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం

మచిలీపట్నం 16 మార్చి 2023 జిల్లాలో జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. ఎస్. జవహర్ రెడ్డి, సీసీఎల్ఏ సాయి ప్రసాద్ తదితరులు అమరావతి సచివాలయం నుంచి గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీసర్వే, హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుండి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లా ప్రగతి వివరించారు. జిల్లాలో మొదటి విడతలో 100 గ్రామాల్లో చేపట్టిన రీసర్వే నూరు శాతం పూర్తికాగా, స్టోన్ ప్లాంటేషన్ లక్ష్య సాధనకు సంబంధించి జిల్లాలో 66,757 స్టోన్స్ రిసీవ్ కాగా, ఇప్పటి వరకు 9,979 రాళ్ల పాతడం పూర్తయ్యిందన్నారు. డ్రోన్ ఫ్లైయింగ్ ప్రగతికి సంబంధించి కృష్ణాజిల్లాలో 485 గ్రామాలకు గాను 444 గ్రామాల్లో డ్రోన్ ఫ్లైయింగ్ పూర్తయ్యిందన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్ జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్, డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ మరియు హౌసింగ్ పీడీ ఇన్చార్జి జీవి. సూర్యనారాయణ, డిపీఓ నాగేశ్వరనాయక్, ఏడీ సర్వే గోపాల్ రాజా, డిఆర్డిఎ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చుల ఎందరికో స్ఫూర్తి

సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం నియోజకవర్గంలో బచ్చుల అర్జునుడు అంచలం చెలుగా ఎదుగుతూ ఎంతోమందికి స్ఫూర్తిని ఇచ్చారని, అనేక పదవులు అలంకరించి ఆ పదవులకే హుందాతనాన్ని తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు సంస్మరణ సభ గురువారం ఆయన నివాసం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని వనజ పాల్గొని, మాట్లాడుతూ అర్జునుడు ప్రజలతో మమేకమై అనేక సమస్యలు పరిష్కరించారని ఆమె కొనియాడారు. ఈ రోజున అర్జునుడు మనమధ్య లేకపోవడం మనందరం జీర్ణించుకోలేని విషయం అని ఆమె వాపోయారు. తొలుత అర్జునుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. సీపీఐ బందరు నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ కోశాధికారి యర్రంశెట్టి ఈశ్వరరావు మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి ఒడుగు రత్నకుమారి వారికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నివాళు లర్పించిన వారిలో మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు, జనసేన పార్టీ బందర్ నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామకృష్ణ, గడ్డం రాజు, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, ఏఎస్ రామకృష్ణ, ఏలూరు మాజీ ఎంపీ మాగంటిబాబు, తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్, వర్లకుమార్‌రాజా, తెలుగుదేశం పార్టీ గుడివాడ నియోజకవర్గం ఇంచార్జ్, రావి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ పెడన నియోజకవర్గం ఇన్చార్జి, కాగిత కృష్ణప్రసాద్, తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, నెట్టెం రఘురాం, సీపీఎం నాయకులు, యాదవ సంఘం నాయకుడు, పల్లపాటి వెంకట్రావు, పల్లపాటి సుబ్రహ్మణ్యం, పి.వి. ఫణి కుమార్, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడుకు ఘనమైన నివాళులర్పించారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర-మచిలీపట్నం : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ డిఆర్వో వెంకటేశ్వర్లు తదితర అధికారులతో కలసి కలెక్టర్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో గాంధీగారితో కలిసి పాల్గొన్న యోధుడని అన్నారు. స్వాతంత్రానంతరం ఆంధ్రరాష్ట్రం కోసం తెలుగు మాట్లాడేవారంతా ఐక్యంగా ఉండాలనే సంకల్పంతో పొట్టి శ్రీరాములు సత్యాగ్రహం చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయనను స్మరించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలును ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. జనరల్, వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులు 218 మందికి ఐదుగురు గైర్హాజరు కావడంతో 213 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలను వృత్తి విద్యా కోర్సుల కృష్ణాజిల్లా అధికారి బి. ఎస్. ఆర్. వి .ప్రసాద్ (మచిలీపట్నం) పరిశీలించారు. ఈ పరీక్షలకు డిపార్ట్మెంటల్ ఆఫీసర్గా ఎల్.హిరణ్మయి (మచిలీపట్నం), చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల లెక్కల అధ్యాపకులు కే కిరణ్ కుమార్(మొవ్వ) వ్యవహరించారు. విద్యార్థులు రెండవ లాంగ్వేజ్ సబ్జెక్టులలో పరీక్షలు రాశారు.

360 మందికి 104 వాహనం ద్వారా వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : 7వ వార్డులోని ఉర్దూ పాఠశాల ఆధ్వర్యంలో 104 వాహనం ద్వారా నిర్వహించిన వైద్య సేవలు 360 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. గురువారం జరిగిన ఈ వైద్య శిబిరంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. విషపు జ్వరాలపై అవగాహన కల్గించి రక్తపోటు, చక్కెర వ్యాధి, గుండె జబ్బుల వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తీసుకోవలసిన జాగ్రత్తలు కొత్తగా వస్తున్న వైరస్ తదితర అంశాలపై రోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు సహాయకులుగా ఎం.సి,హెచ్.పి పద్మప్రియాంక, రాజ్యలక్ష్మీ, భార్గవి, నాగమల్లేశ్వరి, హేమలీల, మంజూలావాణి తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు.

వాతావరణం మార్పుతో రైతుల్లో ఆందోళన

విశాలాంధ్ర-కూచిపూడి : వాతావరణంలో వచ్చిన మార్పులు తో రైతులు భయాందోళనలో పడ్డారు. ఉదయం నుంచి మబ్బులు పడుతూ ఉండటంతో ఆరుగాలంశ్రమించి పండించిన మినపకాయ వర్షానికితడిసి నీటి పాలవుతుందేమోనన్న భయం పలువురురైతులను పట్టి కుంగ తీసింది. ఇదే సమయంలో కొంతమంది రైతులు హడావిడిగా మిషనుతోకోయించి నూర్పుడిచేయించి ఇంటికి తీసుకెళ్లారు. అలాగే గతంలో చేయించిన మినప పనులను సైతం మిషన్ ద్వారా నూర్పిడి చేయించారు. ఖరీఫ్లో వరి కోతలు కోసే సమయంలో సంభవించిన వర్షంకు తడిసి ధాన్యం దెబ్బతిన్న మాదిరిగా రబీలో కూడా సంభవిస్తుందేమోనన్నభయానక వాతావరణం ప్రస్తుతం నెలకొంది.

అలివేలమ్మకు నివాళులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు తల్లి అలివేలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా బృందం గురువారం చినపారుపూడి గ్రామంలో తన ఇంటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో వర్ల పాల్గొన్నారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దోసపాడు గ్రామంలో చోడవరపు రంగారావు ఆర్ఎంపి వైద్యులుగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని ఆ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, పారిశ్రామికాభివృద్ధికి బడ్జెట్ తోడ్పాటు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర బడ్జెట్లో సీఎం జగన్ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తూనే పరిశ్రమలు,వాణిజ్యానికి రూ. 2,602 కోట్లు కేటాయించడం హర్షణీయం అని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కొనకళ్ళ విద్యాధరరావు తెలిపారు. ఈ కేటాయింపులు పరిశ్రమలు, మౌలిక సదుపాయల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయి. వివిధ రంగాలలో ఉత్పాదక సామర్థ్యాలను వెలికితీస్తూ, ఉపాధి కల్పనను ప్రోత్సహించేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి.సూక్ష్మ, చిన్న తరహా సంస్థలు-క్లస్టర్ అభివృద్ధి (ఎమ్ఎస్ఈసీడీపీ) ప్రాజెక్టుల కింద కేంద్ర ప్రభుత్వం నుంచి ఏపీ ప్రభుత్వం ఐదు క్లస్టర్ల నిర్మాణానికి అనుమతి సాధించడం గర్వకారణం అన్నారు. రాష్ట్రం జాతీయ పారిశ్రామికవాడల అభివృద్ధి సంస్థ విశాఖపట్నం నోడ్‌లోని నక్కపల్లి క్లస్టర్, శ్రీకాళహస్తి-ఏర్పేడు నోడ్‌లోని చిత్తూరు సౌత్ క్లస్టర్, విశాఖపట్నం చెన్నై పారిశ్రామిక కారిడార్ (వీసీఐసీ) కింద కడప నోడ్ కొప్పర్తి క్లస్టర్లో పారిశ్రామిక వాడల అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ఆమోదం తెల్పడం శుభపరిణామం.

29న తపాలా అదాలత్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : తపాలా ఫిర్యాదులు-సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 29న తపాలా అదాలత్ నిర్వహిస్తున్నామని పోస్ట్‌మాస్టర్ జనరల్ డి.యస్.వి.ఆర్.మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా సేవలకు సంబంధించి వినియోగదారుల ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు విజయవాడ వారిచే రీజనల్ తపాలా అదాలత్ నిర్వహించబడుతుందన్నారు. తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు ఈనెల 23లోగా "తపాలా అదాలత్" పేరుతో అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్), పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, గాంధీనగర్, విజయవాడ-520003 అను చిరునామాకు పంపాలని కోరారు. ఫిర్యాదు దారులు వ్యక్తిగతంగా కూడా హాజరు కావొచ్చునని ఆయన పేర్కొన్నారు.

రైతు వద్ద ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తాం : ఎమ్మెల్యే సింహాద్రి

విశాలాంధ్ర-అవనిగడ్డ : రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ వాళ్ళు రాద్ధాంతం చేయడంలో అర్థం లేదని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతు వద్ద ఉన్న ప్రతి ధాన్యపుగింజ కొనుగోలు చేస్తామని రంగుమారినా కూడా కొనుగోలు చేస్తున్నామని ఆర్.బి.కె కేంద్రాలలో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న చేయడం లేదని టి.డి.పి నేతలు రాధాంతం చేస్తున్నారని వారు చేసే పనులకు అర్ధం లేకుండా పోయిందని రైతులకు గ్రామలకు మంచి చేయడమే టి.డి.పి నేతలకు నచ్చడం లేదన్నారు. నియోజకవర్గంలోని 6 మండలాలలోని ఏ గ్రామంలోనైనా రైతు వద్ద ధాన్యం ఉంటే ఆర్.బి.కె కేంద్రాల వద్ద సంప్రదించవచ్చని, లేకుంటే నా కార్యాలయం లో కానీ, నా ఫోన్ ద్వారా గానీ సంప్రదించినా కొనుగోలు చేసేందుకు సిద్దంగా ఉన్నానన్నారు. చింతలమడ రోడ్డు ప్రమాధబాధితులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనస్సుతో మృతులకు ఒకోక్కరికి 3 లక్షల చొప్పున, గాయపడిన వారికి ఒకొక్కరికి రూ.50 వేల చొప్పున జిల్లా కలెక్టర్ ద్వారా త్వరలో చెక్కులు అందచేయనున్నట్లు సింహాద్రి చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 2019 ఎన్నికలలో మానిఫెస్టోలో 98.5 శాతం పూర్తి చేశారని, రాష్ట్ర ప్రజలకు మంచి జరిగితేనే ఆదరించమని ఓటు అడగటం దమ్ము ధైర్యం ఉన్న జగన్‌మోహన్ రెడ్డి కే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, ఎన్.టి.ఆర్. గుంటూరు జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావు, మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, కొత్తపేట పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు బడే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'దిశ'తో మరిన్ని సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షురాలుగా పెదముత్తేవి మొవ్వ మండలానికి చెందిన సోలె నాగేశ్వరమ్మను నియమిస్తున్నామని ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బి.వెంకటేశ్వర రాజు తెలిపారు. ఆంధ్రా,తెలంగాణలో నాగేశ్వరి డెవలపర్స్ సంస్థ నుంచి పలు సేవలకు గుర్తింపుగా ఈ బాధ్యతలు అప్పగించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను కృష్ణా జిల్లా అధ్యక్షురాలుగా నియమించడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో మరెన్నో సేవాకార్యక్రమాలు చేయడానికి బడుగు బలహీన వర్గాలు ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను ఎదురించి వారికి అండగా ఉంటామన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు. తనకు అవకాశం ఇచ్చిన దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ వెంకటేశ్వర రాజు, పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్, వైఎస్ ఆర్ టీం ఇండియా జాతీయ అధ్యక్షుడు సురేందర్ రాజ్ రెడ్డి, కాకర్ల శివకుమార్ (చిట్టిబాబు పెదముత్తేవి) దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జాతీయ ఉపాధ్యక్షురాలు కళ్యాణి చోద్రాసి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వి. కోటేశ్వర రావు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వృద్ధశ్రమాల్లో ఉన్న ఆనాథ వృద్ధులకు అన్నదానం చేయడం అనేది ప్రతి ఒక్కరూ మహా భాగ్యంగా భావించాలని బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గుర్రం ఏడుకొండలు, కార్యదర్శి కొండాయగుంట రాము అన్నారు. గురువారం సింగ్‌నగర్ వాంబేకాలనీలో మతృదేవ భోవ వృద్ధశ్రమంలో అన్నదానం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనాధలకు ఆదుకొనేందుకు ఎలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. సేవా భవం అనేది ప్రతి ఒక్కరిలో ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్,ఉపాధ్యక్షులు, మండా రాము తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): డాక్టర్ నూతన్ ప్రసాద్ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు పైడి పాటి వెంకన్న శ్రీదేవి ఆధ్వర్యంలో కౌత కళా మందిరంలో ఘనంగా ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. వివిధ రంగాలలో విభిన్న ప్రతిభా పాటవాలు కలిగిన పలువురిని ఘనంగా సత్కరించారు,ముఖ్య అతిథులుగా విజయ చాముండేశ్వరి, బి,హెచ్, వి,జానా రెడ్డి, నిడుమోలు రమా సత్యనారాయణ, ప్రముఖ వాస్తు నిపుణులు తల్లపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పురస్కార గ్రహీతలును సత్కరించారు,డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ లయన్ వసంత కుమార్,లయన్ గుర్రం ఏడు కొండలు,లయన్ వీరంకి గో కర్నేశ్వర రావు,లయన్ కొండా య గుంట రాము తదితరులు ను ఘనంగా పురస్కారం అవార్డ్స్ ప్రదానం చేశారు,వ్యాఖ్యాత గా దేవిడ్ రాజు వ్యవహరించారు,తొలుత సంగీత విభావరి శ్రోతలను అలరించింది,నూతన్ ప్రసాద్ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు పైడి పాటి శ్రీదేవి వెంకన్న,వెంకటేశ్వర రావు తదితరులు నిర్వహించారు.

సంక్షేమ పథకాలే వైసీపీకి రక్షణ

విశాలాంధ్ర-పమిడిముక్కల: సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లో చైతన్యం తెస్తున్నాయని వైఎస్ యంపిపి కొడమంచిలి మహేష్ అన్నారు.గురువారం మంటాడ లో జెసిస్ మండల కన్వీనర్ పరసా జగన్ ఆధ్వర్యంలో గృహ సారధులకి సచివాలయం సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి వాలంటీరు ప్రతి ఇంటికి వెళ్లి పథకాలు అందుతున్నాయో లేవో తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని ప్రభుత్వం మరల రావాలంటే జగనన్న ప్రవేశపెట్టిన పథకాలపై ప్రచారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు యంపిటిసి మెరుగు శ్రీలక్ష్మి ధూళిపూడి రమాదేవి కె.కోటేశ్వరరావు, యం.కోటేశ్వరరావు, యు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

వైఎస్ఆర్ చారిటీస్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : వైఎస్ఆర్ చారిటీస్ సేవలు అభినందనీయమని తూర్పు నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి దేవినేని అవినాష్ పేర్కొన్నారు. గురువారం వై ఎస్ ఆర్ చారిటీ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి దేవినేని అవినాష్ విచ్చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై ఎస్ ఆర్ చారిటీస్ ఆధ్వర్యంలో ఎలమంచిలి జయప్రకాష్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఓఎస్ఆర్ చారిటీస్కు తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా అవినాష్ హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. తదనంతరం వైఎస్ఆర్ చారిటీస్ అధ్యక్షుడు ఎలమంచిలి జయప్రకాష్ మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకొని పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ చారిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు వైసీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని ఠాగూర్ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్ పర్సన్ మేడం తిప్పర మల్లి జమలాపూర్ణమ్మ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి ఎంతో పోరాడి మన ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం ప్రత్యేకమైన రాష్ట్రం ఏర్పాటు కోసం అహర్నిశలు కృషి చేసి ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగాన్ని చేసిన గొప్ప వ్యక్తి శ్రీ పొట్టి శ్రీరాములు అని ఆయన జయంతి సందర్భంగా మనందరం ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిని కె రమాదేవి గ్రంథాలయ పాఠకులు విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

రోడ్లపై ధాన్యం పట్టించుకునేవారేరీ?

విశాలాంధ్ర-పమిడిముక్కల : ధాన్యం రోడ్లపై వేసి రోజులు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార రాజా అన్నారు. గురువారం కృష్ణాపురం శివారు రాజారావుపేటలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో మాట్లాడుతూ వరి కుప్పలు ఇంకా నూర్పిడి జరగలేదని అప్పుడే రైతు భరోసా కేంద్రం వారు సైతం పనిచేయటం లేదన చెప్పుతుంటే రైతులు ఏమిచేయాలో తెలియని పరిస్థితుల్లో గగ్గోలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు యం.వి.సుబ్బయ్య కతిక నాగేశ్వరరావు ఎల్.బాబురావు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ వీసీని సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ : ఉన్నత చదువుల విశ్వవిద్యాలయంలో ఉన్నత పదవిని నిర్వహించే ఒక వైస్ ఛాన్సలర్ తన సమక్షంలో విపరీత ధోరణులు ఉన్న రామ్‌గోపాల్‌వర్మ వంటి వ్యక్తి వ్యాఖ్యలు వింటూ ఖండించకపోగా, అతనొక తాత్వికుడని ప్రశంసించటం దురదృష్టం అని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర సహాయ కార్యదర్శి వైష్ణవిశ్రీ ఒక ప్రకటనలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. స్త్రీలను,వారి ఆత్మాభిమానాన్ని అతి హీనంగా కించపరచటంతో పాటు, తిని ,తాగి, తిరుగుతూ చదువును నిర్లక్ష్యం చేయమంటూ విద్యార్థులకు సందేశం ఇవ్వడం పట్ల ఆమె అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఈ సంఘటనపై విచారణ జరిపించాలని, వైస్ ఛాన్సలర్ ని వెంటనే ఆ పదవినుంచి తొలగించాలని, రామ్ గోపాల్ వర్మ మీద వెంటనే కేసు బుక్ చేసి, అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నరసం ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ జోశభట్ల స్వాతి స్పందిస్తూ స్త్రీ జాతికి నేనొక్కడినే దిక్కువుతా అని, విద్యార్థులు ఉపాధ్యాయుల మాటలు వినకుండా ఇష్టానుసారం జీవించాలని రామ్ గోపాల్ వర్మ అనడం,ఈ మాటలను విన్న వైస్ ఛాన్సలర్ ఖండించకపోగా అతనిని ఫిలాసఫర్ అంటూ పొగడటం సిగ్గు చేటని, పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే అవమానకరమని గర్హించారు. ఈ విషయంపై యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలు అందరూ నిరసన వ్యక్తం చేయాలని,నరసం ప్రతి జిల్లాలోనూ ఈ విషయంపై సభలు సమావేశాలు నిర్వహించాలని అన్నారు. ఈ విషయమై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

22 నుంచి ఇసుజు ఐ-కేర్ సమ్మర్ క్యాంప్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఉత్తమ సేవ, యజమాని అనుభవాన్ని అందించుటకు ఇసుజు యొక్క నిబద్ధతను తిరిగి ధృవీకరించే తన నిరంతర ప్రయత్నంలో ఇసుజు మోటార్స్ ఇండియా తన ఇసుజు డి-మ్యాక్స్ పిక్-అప్స్, ఎస్ యూవీల శ్రేణి వాహనముల కొరకు ఒక దేశవ్యాప్త ఇసుజు ఐ-కేర్ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించబోతోంది. వినియోగదారులకు అద్భుతమైన ప్రయోజనాలను, ఈ వేసవిలో సమస్యారహితమైన డ్రైవింగ్ అనుభవం కొరకు ప్రివెంటివ్ మెయింటెనెన్స్ చెకప్స్ అందించాలనేది ఈ సర్వీస్ క్యాంప్ ఉద్దేశంగా వుంది. ఇసుజు కేర్ యొక్క ప్రయత్నంలో భాగంగా మార్చ్ 22 నుండి 29 వరకు అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్లెట్లలో సమ్మర్ క్యాంప్ నిర్వహించబడుతుంది. ఈ సమయంలో వినియోగదారులు తమ వాహనాలపై ప్రత్యేక ఆఫర్లు, ప్రయోజనాలను కూడా అందుకోవచ్చు.

క్షయపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-గన్నవరం : క్షయపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సిడిపిఓ వెంకటలక్ష్మి అన్నారు. గురువారం గన్నవరం సిడిపిఓ కార్యాలయంలో రేఆఫ్ హోప్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ మురళి మాట్లాడుతూ 60 రాజుల నుండి దగ్గువస్తే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టరుని సంప్రదించాలని సూచించారు. డాక్టర్లు క్షయ ఉంటే దానికి సంబంధించిన మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వెంకట లక్ష్మీ, అంగన్‌వాడి కార్యకర్తలు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మార్కాపురం అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.43/2017

పోలిరెడ్డి గాలిరెడ్డి - అప్పీలెంటు
Vs
భీమవరపు వెంకట సుబ్బారెడ్డి @ సుబ్బారెడ్డి - రెస్పాండెంటు

To
భీమవరపు వెంకట సుబ్బారెడ్డి @ సుబ్బారెడ్డి, తండ్రి భక్తిరెడ్డి, డోర్ నెం. 2-93, పెద్ద ఓగిరాల గ్రామం, ఉయ్యూరు మండలం, కృష్ణాజిల్లా.

పై నెంబరు అప్పీలును అప్పీలెంటు మీపైన దాఖలు చేసి ఉన్నారు. ఈ అప్పీలునందు మీకు కోర్టుద్వారా అప్పీలు నోటీసులు ఎన్ని పర్యాయములు పంపిన తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా మీకు అప్పీలు నోటీసులు జారీ చేయమని ఆర్డరు వేసియున్నారు. కావున మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల వాయిదా 31-03-2023వ తేదీ ఉదయం 10.30ని॥లకు మీరు స్వయంగా కాని లేదా వకీలు ద్వారాగాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనగలరు. లేనియెడల మీ పరోక్షమందు విమర్శ చేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయుడమైనది.

వాయిదా తేది: 31-03-2023

ఆర్.వి. నాగేశ్వర శాస్త్రి
అడ్వకేట్, మార్కాపురం - 523316.

ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వైఎస్సార్సీపీ ప్రభుత్వ తీరుతో ప్రజలు విసిగిపోయి గద్దె దింపేందుకు సిద్ధంగా ఉన్నారని అయితే ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వాన్ని దింపేందుకు ఏకతాటిపైకి రావాల్సిన ఆవశ్యకత ఉందని అమరావతి బహుజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి మిత్రభేదం అనే పుస్తకం బాగా తెలుసు. మిత్రుల మధ్య విభేదాలు ఎలా పెట్టాలో ఆయనకు వెన్నతో తెలిసిన విద్య అన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలో దగా పడిన వారిలో అత్యధిక శాతం దళిత బహుజనులే అని తెలిపారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. జగన్ ప్రభుత్వానికి 1825రోజుల పరిపాలన కాలంలో 1386రోజులు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో శిరంశెట్టి నాగేంద్రరావు, మామిడి సత్యం, కనకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రాండ్ మోడల్స్ వాచ్‌లతో 'టైటాన్'

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): టైటాన్ వరల్డ్‌గా సరికొత్త గుర్తింపు పొంది అంతర్జాతీయ బ్రాండ్ మోడల్స్ వాచ్‌లతో అధునాతన షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందని టైటన్ కంపెనీ లిమిటెడ్ రీజినల్ బిజినెస్ హెడ్ శరద్ చెప్పారు. బందరు రోడ్డులో చేసిన టైటాన్ వరల్డ్, హీలియోస్, ఫాస్ట్రాక్ ట్రాంబే స్టోర్‌ను స్టోర్‌ని టైటన్ కంపెనీ లిమిటెడ్ రీజినల్ బిజినెస్ హెడ్ శరద్, రీజినల్ బిజినెస్ మేనేజర్ రేవతి రంగస్, టైటాన్ కంపెనీ లిమిటెడ్ బిజినెస్ అసోసియేట్, రత్న ప్రభు- కలిసి ప్రారంభించారు. టైటన్ కంపెనీ లిమిటెడ్ రీజినల్ బిజినెస్ హెడ్ శరద్ మాట్లాడుతూ కుటుంబ సమేతంగా ఎంచుకోవడానికి వెయ్యికి పైగా డిజైన్లతో టైటాన్, ఫాస్ట్ ట్రాక్‌వాచ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహం పెట్టాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : స్వరాజ్యమైదానంలో డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ప్రక్కన డా.బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహం కుడా ఏర్పాటు చేయాలని ఎపి యంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వర రావు మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ అంటరాని బ్రతుకుల విముక్తి కోసం పోరాడి వారి ఎదుగుదలకు విద్య, ఉద్యోగం, రాజకీయ రిజర్వేషన్లను రాజ్యాంగంలో ప్రతిపాదిస్తే ఆ రిజర్వేషన్లను అమలు చేయడంలో కీలకపాత్ర వహించిన ఘనత డా బాబూ జగజ్జీవన్ రామ్‌దేనని, దేశంలో సామాజిక మార్పు కోసం పనిచేసిన ఆ ఇద్దరు దళిత, గిరిజన, వెనుకబడిన కులాలకు రెండు కళ్ళులా పనిచేశారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం గురించి పదే పదే మాట్లాడే ముఖ్యమంత్రి జగన్ అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి జగజ్జీవన్ రామ్ విగ్రహం పెట్టకపోవడం వల్ల దళిత గిరిజనుల మధ్య సామాజిక అసమానతలను సృష్టించడం. కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ విగ్రహం ప్రక్కనే డా.బాబూజగజ్జీవన్‌రామ్ విగ్రహం పెట్టాలని, అందుకు ప్రతిపక్ష, వామపక్ష పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.దానిలో భాగంగానే ఈనెల 24న ఐలాపురం హోటల్‌లో దళిత, గిరిజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశములో జై మాదిగ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొదమల బెంజిమెన్, నవ్యమాదిగ చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంజర్ల సుబ్బారావు, ఆదివాసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనుముల వంశీ,పూనూరు జార్జి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: జి కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ : అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లించే విధంగా రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు కేటాయించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న బాధితుల శిబిరాన్ని గురువారం సందర్శించి సంఘీభావం తెలియచేసి మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లో బాధితుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరములు అవుతున్న నేటికి పరిష్కరించకపోవటం శోచనీయమన్నారు. వెంటనే బడ్జెట్‌లో నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమరశీల యువజన ఉద్యమపతాక ఏఐవైఎఫ్

రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : సమరశిల యువజన ఉద్యమాల పతాక అఖిల భారత యువజన సమాఖ్య అని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర అన్నారు. స్థానిక జగ్గయ్యపేట డిపో ఎదురుగా గల పిల్లలమర్రి వెంకటేశ్వరరావు భవన్‌లో జగ్గయ్యపేట పట్టణ యువజన సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం ఎంగ్రపల్లి భాను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా ఆవిర్భవించి నాడు స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు , కన్నెగంటి హనుమంతు లాంటి అమర్ వీరుల పోరాట స్ఫూర్తితో యువజన సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని అనేక పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లంక గోవిందరాజులు సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రముఖ న్యాయవాది జూనియర్ బోయిన శ్రీనివాసరావు నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంబాజీ శివాజీ , ఎంగ్రపల్లి భాను, బ్రింజా లింగేశ్వరరావు, గుడిసె కిషోర్, ఈశ్వర్, సొమ్ము, టీ ప్రశాంత్ ,పెరుమాళ్ళ రాకేష్ ,రుంజ రాజా, మని, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

గుణదల హిందూ శ్మశానవాటిక అభివృద్ధిచేయాలి: జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ : అధ్వానంగా ఉన్న హిందూ స్మశాన వాటికను అభివృద్ధి పరచాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు నగరపాలక కమిషనర్‌ను కోరారు. గురువారం సీపీఐ నగర నాయకులు గుణదల హిందూ స్మశాన వాటికను సందర్శించి, అక్కడ ఉన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా శవాలను దహనం చేసే రేకులషెడ్డు తుప్పుపట్టి, ముక్కలు ముక్కలుగా ఊడి పడిపోతుంది. వర్షం వస్తే దహనం చేసే సందర్భంలో మంటలు ఆరిపోయి శవాలను కల్చలేని పరిస్థితి. అందువలన రేకుల షెడ్డును నాలుగు వైపుల రెండు మీటర్ల మేరకు పెంచి, దహన కార్యక్రమం నిర్వహించుకునేందుకు బీడ్‌తో గ్రిల్ ఏర్పాటు చేయవలసి వున్నది. అలాగే శవాలను భద్రపరచే ఫ్రీజర్ల ఏర్పాటుకు 3ఫేస్ కరెంటు కూడా సరఫరా చేయవలసి వున్నది. చుట్టూ ఉన్న ప్రహరీ గోడను నాలుగు అడుగుల మేరకు అభివృద్ధి చేసి దహన సంస్కారం చేసేందుకు వచ్చే వారికి షెడ్డు ఏర్పాటు చేయటం ద్వారా గుణదల హిందూ స్మసాన వాటిక అభివృద్ధి పరచాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధికారులను, ప్రజా ప్రతినిధులను డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయకార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు నగర నాయకులు కొడాలి ఆనందరావు, కొండేటి శ్రీనివాసరావు, తాడిశెట్టి సత్యనారాయణ, శివనారాయణ, ఐ.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల విషయంలో మాట తప్పి, మడమ తిప్పిన జగన్

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమైనాయి ? మోడీ సారు

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు

విశాలాంధ్ర-విజయవాడ : నిరుద్యోగులకు ఏటా జాబ్ క్యాలెండర్ ఇచ్చి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పారని ,ఎడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు హామీ ఏమైందని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు ప్రశ్నించారు. విభరింతల పాడు గ్రామంలో ఏఐవైఎఫ్ చందర్లపాడు మండల జనరల్ బాడీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ మాట తప్పారని అన్నారు. అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు అయినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వక పోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు అమ్ముతూ అంబానీ,అదానిలకి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయమంటే పకోడీ, బజ్జీ బండ్లు పెట్టుకుని బ్రతకమని మంత్రులు ప్రకటించడం సరికాదని అన్నారు. కేంద్రంలో మోడీ కంటే తాను ఏమి తక్కువ అన్నట్లు సీఎం జగన్ వ్యవహరిస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ మాట తప్పను, మడప తిప్పను అని చెప్పి, 'నేను ఉన్నాను- నేనూ విన్నాను' అని మభ్య పెట్టి అధికారంలోకి వచ్చాక కనీసం నిరుద్యోగులు కలిసే అవకాశం కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా 2,35,794 పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నందిగామ నియోజక వర్గ కార్యదర్శి మన్నే హనుమంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మౌలాలి నాగరాజు, శిలారు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠాఅరెస్ట్

విశాలాంధ్ర-విజయవాడ క్రైం/నందిగామ రూరల్: అంతరరాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠాను ఎన్టీఆర్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 580 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలతో సుమారుగా రూ.34లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణా రాష్ట్రానికి చెందిన గోర్రె శ్రీనివాస్, చల్లా వెంకటేష్, కొనగాళ్ళ గణేష్, దేవనబోయిన మహేష్‌లను అరెస్టు చేశారు. కమాండ్ కంట్రోల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మేరీ ప్రశాంతి వివరాలను వెల్లడించారు. గొర్రె శ్రీనివాస్ క్యాటరింగ్ పనులు చేసుకుంటూ ఉండేవాడు.

ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడి సంపాదించిన డబ్బులు జల్సాలకు సరిపోక ఏవిధంగానైనా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో, తన సమీప బంధువైన చల్లా వెంకటేశ్వర్లుతో కలిసి రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనం చేసి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసుకున్నారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని వారిని వెంబడించి వారి మెడలోని బంగారు ఆభరణాలను లాక్కుపోయి (చైన్ స్నాచింగ్) వాటిని అమ్ముకుని జల్సాలు చేద్దాం అని నిర్ణయించుకున్నారు. వీరి సమీప బంధువులు కొనగాళ్ళ గణేష్, దేవనబోయిన మహేష్‌లకు పూర్తి వివరాలను తెలియజేసి అందరూ కలిసి జల్సాలను చేయడానికి చైన్‌స్నాచింగ్‌లు చేయాలని నిర్ణయించుకున్నారు. గత ఏడాది అక్టోబర్ నెలలో శ్రీనివాస్, వెంకటేష్‌లు బైక్‌పై వెళ్తున్న సమయంలో ఖమ్మం జిల్లా బూర్గంపాడు సమీపంలో ఒంటరిగా ఉన్న మహిళను గమనించి దగ్గరగా వెళ్లి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని వెళ్ళిపోయారు. ఈ విధంగా గణేష్, మహేష్‌లతో కలిసి ఆరు నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధులలో ఒంటరిగా ఉన్న మహిళల మెడలలో మొత్తం 16 చైన్‌స్నాచింగ్‌లు చేశారు. నందిగామ టౌన్‌లో పోలీసులకు సమాచారం రావడంతో ఈ ముఠాను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. చైన్‌స్నాచింగ్ నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన పోలీసులకు రివార్డులను అందజేశారు.

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : గుంటుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో త్వరలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం నేపథ్యంలో గ్రామానికి చెందిన దక్షిణ మధ్య రైల్వే ప్రజానాట్యమండలి (సీపీఐ అనుబంధ) శాఖ సీనియర్ నాయకులు బల్లి వెంకటేశ్వరరావు, రంగమ్మలు తమ అల్లుడు, కుమార్తె చక్రపాణి, జ్యోతిల చేతులమీదుగా 56 మంది విద్యార్థులకు ప్యాడ్, స్కేలు, పెన్ను, పెన్సిల్, ఎరైజర్, షార్ప్నర్‌లతో కూడిన స్టేషనరీ సెట్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను ఎప్పుడూ విద్యార్థులకు సహాయ పడాలనే ఆలోచనలో ఉండే వాడినని తాను ఉద్యోగంలో ఉన్నప్పుడు కూడా సంస్థకు అనుబంధంగా ఉన్న సీపీఐ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడినని ఒకరికి సహాయపడాలి అని దానిని సీపీఐ నుండే అలవర్చుకున్నానని అందుచేతనే పదవ తరగతి పరీక్షలు జరుగుతున్నందున తన గ్రామంలోనికి విద్యార్థులను ఎంపిక చేసుకొని స్టేషనరీని ఇచ్చారని తెలిపారు.

పొట్టి శ్రీరాములు ఆశయ సాధన నేటి తరానికి ఆదర్శనీయం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : మహాత్మా గాంధీ భోదించిన సత్యం, అహింసా హరిజనోద్ధరణకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు నేటి తరానికి ఆదర్శప్రాయుడని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఆంధ్రరాష్ట్ర సాదనకు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ గురువారం పూలమాలలు వేసి ఘనంగా నవాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముంబైలో శానిటరీ ఇంజనీరింగ్ విధ్యనభ్యసించి గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో నాలుగేళ్ల పాటు ఉద్యోగం చేశారని గుర్తు చేశారు. అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఆశయాలను స్మరించుకోవాలి : మేయర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నేటి యువత అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను స్మరించుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి మేయర్ గురువారం పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాడిన మహనీయులు పొట్టి శ్రీరాములని, ఆయన తుది శ్వాస వరకు తెలుగు జాతి ఐక్యత కోసం పోరాడి అమరజీవిగా చరిత్రకెక్కారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేవీ.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

అమరజీవికి పొట్టి శ్రీరాములుకి నివాళి

విశాలాంధ్ర-తిరువూరు: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని తిరువూరు ఎమ్మెల్యే రక్షణ అన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో జరిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాగేశ్వరరావు ఈవోపిఆర్డీలు బాబురావు, వెంకటరత్నం, నగర పంచాయతీ కార్యాలయంలో చైర్పర్సన్ కస్తూరిబాయి కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

'అమరజీవి'కి ఘన నివాళులు

విశాలాంధ్ర-వీరులపాడు: అమరజీవి పొట్టి శ్రీరా ములు జయంతి సందర్భంగా వీరులపాడు మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరా ములు జయంతి వేడుకలను గురువారం నిర్వహిం చారు. మొదటగా తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తహశీల్దార్ ఆశయ్య మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి, మహా పురుషుడు, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ ఐ శివకుమార్, వీఆర్వోలు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న సగర ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-విజయవాడ : ఈనెల 19వ తేదీ ఆదివారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సగర ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సత్యనారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి రాంబాబును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో సన్మానించటం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నిద్రపోయిన దుర్గారావు, తాడిశెట్టి నాగేశ్వరరావు, గుర్రం ఏడుకొండలు, నక్క గోపాలరావు, గుర్రం బాబు, కల్వకోలు శ్రీనివాస్ నక్క ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు ఎన్నటికీ చిరస్మరణీయం

విశాలాంధ్ర-విజయవాడ : దేశం కోసం రాష్ట్రం కోసం తమ జీవితాలను త్యాగాలు చేసిన మహానుభావులు సదా చిరస్మరణీయ్యులని గాంధీ స్మారక నిధి ప్రతినిధి దోగిపర్తి శంకరరావు కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సభ గురువారం నాడు స్థానిక స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో శంకరరావు మాట్లాడుతూ మనకు రాష్ట్రం ఏర్పడక ముందు ఉత్తరాది రాష్ట్రాల వాళ్ళు మనల్ని మద్రాసీలని పిలిచేవారని తెలిపారు. ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు సదా చిరస్మరణీయులని వారి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా చీలిపోవడం ఎంతైనా బాధాకరం అన్నారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సర్వోదయ ట్రస్ట్ సభ్యులు కొత్త విజయకుమార్ నూలు దండను వేసి నివాళులు అర్పించారు. సర్వోదయ ట్రస్ట్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, నాదెళ్ల సుమతీదేవి, అజామ్, వృద్ధుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బూడిదలారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : హైదరాబాద్ జాతీయ రహదారిపై పశ్చిమ ఇబ్రహీంపట్నం బీపీసీఎల్ పెట్రోల్‌బంకు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. నిమ్రా కాలేజీ వైపు రాంగ్ రూట్లో వెళ్తున్న ద్విచక్ర వాహనదారున్ని బూడిద లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దాములూరుకు చెందిన ఆర్.ఎం.పి బొజ్జగాని సురేష్ (40) నిమ్రాలో అటెండర్‌గా పనిచేసే భార్యను విధులు ముగించుకోవడంతో తీసుకువెళ్లేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్సై శ్రీనివాస్ లారీని స్టేషన్‌కు తరలించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పది' పరీక్షలకు సిద్ధంకావాలి : కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : విద్యార్థులు మానసిక ప్రశాంతతో 10వ తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని, పాఠ్యాంశాల్లోని భావాన్ని పూర్తిగా అర్థం చేసుకుని పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాదించాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఏప్రిల్ 13వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో గురువారం కలెక్టర్ వన్‌టౌన్‌లోని తేలప్రోలు బాపనయ్య ఎయిడెడ్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు కేవలం 15 రోజులు వ్యవతి మాత్రమే ఉందని విద్యార్థులకు ఈ సమయం ఎంతో కీలకమయినదన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు భోదించే పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకుంటే పరీక్షలను ఎదుర్కోవటం సులభతరం అవుతుందన్నారు. మానసిక ప్రశాంతతో విద్యపై శ్రద్ధ పెట్టి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఫలితాలు సాదించటంలో పోటీతత్వం ఉండాలన్నారు. ఈ పరీక్షలు జీవితానికి కీలకమైన మలుపని మంచి ఫలితాలు సాదిస్తే ఉన్నత విద్యనభ్యసించేందుకు మార్గం సులభతరమవుతుందన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు.ప్రశ్నలకు జవాబులు రాసే విధానం, ఒత్తిడిని తట్టుకుని ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈఏడు 10వ పరీక్షలకు కేవలతం ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయని, పరీక్షకు, పరీక్షకు మధ్య రెండు రోజుల వ్యవది ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాధురి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్య తీర్చాలని ఆందోళన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: చుక్కల భూముల పేరుతో తమ సాగుభూములకు ఉన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని తెల్లదేవరపల్లి తండా గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ గ్రామంలో దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న సుమారు 200 ఎకరాల భూమిని ఈ గ్రామానికి చెందిన జమీందార్లు సీలింగ్ చట్టంలో చూపకుండా అక్రమ విక్రయాలు చేశారన్నారు. నాటి నుంచి తమ సాగులో ఉన్న ఈ భూములను ప్రభుత్వం తాజాగా చుక్కల భూముల పేరుతో హక్కు పత్రాలు నిలిపి, వేధింపులకు పాల్పడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరు చేసిన ఆందోళనకు సీపీఎం, సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీలు మద్దతు ప్రకటించాయి.

అవ్యక్తం వ్యాసాల సంపుటి ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : యనమదల మంజు రాసిన అవ్యక్తం సమాజ విశ్లేషణా వ్యాసాల సంపుటిని విజయవాడ నవ్యాంధ్ర రచయితల సంఘం కార్యాలయంలో సుప్రసిద్ధ వైద్యులు డాక్టర్ త్రిపురనేని రాజగోపాలరావు(యుఎస్ఎ) ఆవిష్కరించారు. తదుపరి ఆయన మాట్లాడుతూ సమాజంలో మనకు ఎదురయ్యే రకరకాల వ్యక్తిత్వాలను అవ్యక్తం వ్యాసాల్లో కళ్ళకు కట్టినట్టు రచయిత్రి వ్రాశారన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత్రి యనమదల మంజు,డాక్టర్ యలమంచిలి సుమిత్రా చౌదరి, కన్నెగంటి సాంబశివరావు,నవ్యాంధ్ర రచయితల సంఘం కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్ లు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ, ఫ్లిప్‌కార్ట్ ఫస్ట్ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ, భారతదేశంలోని స్వదేశీ ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ విస్తృతమైన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఉనికిని కలిగి ఉన్న ఓమ్నిచానెల్ బి2బి ప్లాట్‌ఫారమ్ ఇండస్ట్రీ-ఫస్ట్ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్‌ను ప్రారంభించింది. ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ సభ్యుల కోసం క్రెడిట్ కార్డ్ డిస్కవర్ గ్లోబల్ నెట్వర్క్‌లో భాగమైన డైనర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నెట్వర్క్‌లో ఇది రన్ అవుతుంది. డైనర్స్ క్లబ్ కార్డ్‌లు ప్రపంచవ్యాప్తంగా 200 కంటే ఎక్కువ దేశాలలో ఉపయోగించవచ్చు. ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ బిజినెస్ హెడ్ కోటేశ్వర్ ఎల్ఎస్ మాట్లాడుతూ ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్‌లోని సభ్యులు ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ ఆన్‌లైన్ ఖర్చులపై ఐదు శాతం క్యాష్‌బ్యాక్ ఇండస్ట్రీ ఫస్ట్ ఆఫర్‌ను పొందవచ్చన్నారు.

కేఎల్ రావు పార్క్ ఆధునీకరణ వేగవంతం : మేయర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని డాక్టర్ కేఎల్ రావు పార్క్ ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పర్యటనలో భాగంగా మేయర్ గురువారం 46వ డివిజన్‌లోని డాక్టర్ కేఎల్ రావు పార్క్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేఎల్ రావు పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పార్క్‌లో ప్రజలకు అందుబాటులో ఉన్న షేటిల్ కోర్ట్, స్కేటింగ్, పిల్లల ఆటపరికరాలు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, పార్క్ కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

గణితంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ : నిజజీవితంలో గణితం ఎలా ఉపయోగ పడుతుందనే అంశంపై ఆంధ్రలయోలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం సదస్సు జరిగింది. జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ జీవీఎస్ఆర్.దీక్షితులు, కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జి.వెంకట రమణారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజజీవితంలో సాధారణ అవకలన సమీకరణాలు విద్యుత్ ప్రవాహాన్ని, లోలకం వలె ఒక వస్తువు కదలికను లెక్కించటానికి ఉపయోగపడుతాయని వివరించారు. థర్మోడైనమిక్స్‌లో, వైద్య రంగంలో వ్యాధుల వ్యాప్తికి గ్రాఫికల్‌గా ఎలా తనిఖీ చేయాలో భేదాత్మక సమీకరణాలను ఉపయోగించి విశ్లేషణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ ఫ్రాన్సిస్ జావియర్, అసిస్టెంట్ డైరెక్టర్ డి.బాలస్వామి, కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములకు నివాళులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: రాష్ట్ర అవతరణకు కృషి చేసి, ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని విస్సన్నపేటలో పలువురు గురువారం నివాళులర్పించారు. విస్సన్నపేట పంచాయతీ కార్యాలయంలో సర్పంచి ఎస్. నాగమల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి ముఖ్య అతిథిగా హాజరై, శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి మందపాటి సత్యనారాయణరెడ్డి, వార్డు సభ్యులు ఎన్వి.కుటుంబరావు, అనుమోలు శివబాజి, పిల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపం వద్ద ఉన్న శ్రీరాములు విగ్రహం వద్ద ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాము కొండలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకుడు పులపాక బాబు, మండల అధ్యక్షురాలు తోకల సుమ, నాయకులు పి.రామచంద్రరావు, తాళ్ల శ్రీనివాసరావు, బొద్దు అనిల్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER FORUM-II KRISHNA AT VIJAYAWADA

Crl. M.P.No.23/2019 in CC.No.100/2018

Between :
M/s. Cool City Services Rep. by its Manager **- Petitoner/Opposite Party**
And
Lakkaraju Venkata Ramana **- Respondent No.1/ Complainant**
M/s. ETA General Private Limited & Another **- Respondents 2 & 3 Proposed Opp. Parties**

To
Respondent No.2/ Proposed O.P.No.2
M/s. ETA General Private Limited & Another
Branch Office : R.S. Towers, D.No. 40-25-80, III Floor, Kurra Satyanarayana Street, Patamatalanka, Vijayawada-15.

పై నెంబరు Crl.M.P 23/2019 in CC No.100/2018 case లో 2వ Proposed Respondent కు నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము **ది. 24-4-2023వ** తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు 2వ Proposed Respondentకు ఏ విధమైన ఆక్షేపణలు ఉన్నచో మీరుగాని లేక మీ తరఫున న్యాయవాది గారి ద్వారాగాని శ్రీ కోర్టువారికి తెలుపుకొనగలరు. లేనియెడల సదరు caseను పరోక్షమునందు తీర్మానించబడును అని ఇందుమూలంగా తెలియచేయుడమైనది.

వాయిదా తేది : 24-4-2023

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

CHANUMOLU JAGADEESH
Advocate, D.NO. 29-14-24, 1st Floor, Opp. I.V. Palace, Prakasam Road, Governorpet, Vijayawada - 520 002.
(Off) : 0866-2434654, (R) 2551707
Mobile : 91 9866682222.

In the Court of the IInd Addl Dist Court at Vijayawada

I.A.1426/22 in O.S. 193/2017

Between :
Gurrala Sridevi
Repby its GPA holder
Marri Raghava Rao - Petitioner/ Plaintiff
And
1. Puli Kameswara Rao, S/o. Rama Rao **- Defendant**
2. M/s. Reliance Digital Platform & Project Services Limited, Registered Office 101, Saffory, Nr. Centre Point, Panchwat 5 Rasta, Ambawadi, Ahmedabad; Gujarat, State and circle office at Reliance Majestic, 8-2-626, B Block Road No.11, Banjara Hills, Hyderabad- 500034.
Represented by its Authorised reprasentative, Sri Vadla Mohan Reddy, S/o. Venkata Reddy
- Proposed/ 2nd Defendant

పై నెంబరు దావాలో IA/1426/2022 పిటిషన్ యందు Proposed (2nd Defendant Party Main suit లో Join చేయుటకుగాను పై తెలిపిన IA 1426/2022 పిటిషన్‌ను ఇందలి Plaintiff పై తెలిపిన కోర్టుయందు దాఖలు చేసియున్నారు. ఇట్టి స్థితిలో పై కోర్టునుండి ఎన్నిసార్లు మీకు నోటీసులు పంపించినను తీసుకొనక కావాలనే కాలయాపన చేయు చున్నారు. ఇట్టి స్థితిలో పై నెంబరు పిటిషన్ **ది. 27-3-2023వ** తేదీనకు వాయిదా అయి ఉన్నది. కావున మీరు ప్రత్యక్షముగా గాని లేక అడ్వకేట్‌గారి ద్వారాగాని పై తెలిపిన కోర్టుయందు **ఉదయం 10.30గంటలకు** హాజరు కాగలరు లేనిచో మీకు పరోక్షముగా తీర్మానము చేయబడును.

వాయిదా తేది :27-3-2023

(పై కోర్టువారి అనుమతితో)

విజయవాడ
ది.14-3-2023

పి. మీనా లక్ష్మి,
అడ్వకేట్, విజయవాడ